
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

సోమవారం 3 ఫిబ్రవరి 2025 | 5







సామర్లకోటలోని పొలాలు, మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్ద కురుస్తున్న మంచు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పంటపొలాలపై పట్టేసిన పొగమంచు



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పంటపొలాల మీదుగా కనిపిస్తున్న పొగమంచు



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో తెల్లవారుజామున ఆవరించిన మంచు

మంచే.. ముసకేసిందిరే..!

మంచే ముసకేసిందిలే.. అన్నట్టుగా జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల్లో ఉదయం పొగమంచు ఇలా ఆవరించి రహదారులు కనపడకుండా చేసింది. దీంతో ప్రయాణికులు కాస్త తికమకపడ్డారు.



కాకినాడ-సామర్లకోట రహదారిలో పొగమంచు

ఇటు ప్రయాణం.. నరకమే!



గొల్లప్రోలు మండలం చేబ్రోలు-మల్లవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో లేచిపోయిన రాళ్లు

- రోడ్డును తవ్వేసి.. మరమ్మతులు మరిచారు
- గొల్లప్రోలు మండలం చేబ్రోలు-మల్లవరం ఆర్‌అండ్‌బీ రహదారిలో 58 రోజులుగా ఇదే పరిస్థితి
- డిప్యూటీ సీఎం పేషీని తప్పుదోవ పట్టించిన ఆర్‌అండ్‌బీ అధికారులు

01.12.2024

'గోతులమయంగా మారి అధ్వానంగా ఉన్న చేబ్రోలు-మల్లవరంరహదారికి తక్షణం మరమ్మతులు చేపట్టి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి' ఇది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆయన పేషీ అధికారులు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు ఇచ్చిన సమాచారం.

4.12.2024

డిప్యూటీ సీఎం ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారుల్లో హడావుడి మొదలైంది. ఐదు కిలోమీటర్ల మేరఉన్న రహదారిపై గోతులుఉన్న ప్రాంతాలను తవ్వేసి పైపైన వెట్ మిక్స్ వేసి గోతులు కనబడకుండా చేశారు. డిప్యూటీ సీఎం పేషీకి పనులు నిర్వహించినట్లు సమాచారం ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి, గొల్లప్రోలు రూరల్

ప్రస్తుత పరిస్థితి..

రోడ్డు మొత్తం రాళ్లు లెగిసిపోయి ఆ రోడ్డుపై ప్రయాణం 8గ్రామాల ప్రజలకు నరకాన్ని చూపిస్తోంది. షష్ఠి మహోత్సవాలకు వచ్చిన భక్తులు పైమెరుగు పనులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు దుమ్ము ధూళి, రాళ్ల మధ్య ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. నిధులు పుష్కలంగా ఇచ్చి రోడ్లకు మరమ్మతులు నిర్వహించడతోపాటు గుంతులు కనబడకుండా చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు సక్రమంగా అమలు కావడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు కొత్తకష్టాలు వచ్చి పడుతున్నాయి. 58రోజులుగా పరిస్థితి అలానే ఉండి ప్రజలకు నరకం కనిపిస్తున్నా అధికారుల్లో కదలిక లేదు.

గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి ఏకేమల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల మీదుగా తొండంగి మండలం ఏవీ నగరంవెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు నిర్వహించకపోవడంతో అధ్వాన స్థితికి చేరుకొంది. గతేడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన వర్షాలు, ఆపై వరదలతో ఈ రోడ్డుపై పలుచోట్ల భారీ గోతులు పడ్డాయి. పది కిలోమీటర్ల రహదారిలో 60శాతంపైగా అధ్వానంగా ఉండడంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించే ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, ఏవీ నగరం, రావికంపాడు, కొమ్మనాపల్లి, రమణక్కపేట, నాగులాపల్లి, చేబ్రోలు ప్రజలు,పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్‌అండ్‌బీరహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ.40లక్షలు మంజూరుచేసింది. పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఆదేశించింది.

భక్తులు ఇబ్బంది పడకూడదని..

నిధులు ఇచ్చినా పనులు సకాలంలో ప్రారంభం కాలేదు. డిసెంబరు మొదటివారం మల్లవరంలోజరిగే స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠిమహోత్సవాలకు తరలివచ్చే భక్తులు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణాలు సాగించాల్సి ఉంది. భక్తులు గోతుల రోడ్డుపై ఇబ్బందులు పడతారనే విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన సూచనల మేరకు డిప్యూటీ సీఎం పేషీ అధికారులు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణం పనులు నిర్వహించాలని ఆదేశించారు.

హడావుడే మిగిలింది..

డిప్యూటీ సీఎం పేషీ నుంచి వచ్చిన ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ అధికారుల్లో హడావుడి మొదలైంది. చేబ్రోలు-మల్లవరం మధ్య రోడ్డుపై గోతులుఉన్న ప్రాంతాలను పూర్తిగా తవ్వేసి పైపైన వెట్‌మిక్స్ పల్చగా వేసిపనులు నిర్వహించేసినట్లు డిప్యూటీ సీఎం కార్యాలయానికి సమాచారమిచ్చారు. అప్పట్లోనే ఇలా పనులు నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. షష్ఠి ఉత్సవాలు ముగిసేలోగానే వెట్‌మిక్స్ తొలగిపోయి రాళ్లు లెగిసి పోవడం ప్రారంభమైంది. తర్వాత పనుల నిర్వహణను అధికారులు వదిలిపోయారు. అధికారులు చేసిన పనితో ప్రజలకు ఈ రహదారిపై ప్రయాణం ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. రాత్రి సమయాల్లో రాళ్లపైకి వాహనాలు ఎక్కి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ఆర్‌బీ చెరువు మూడో తూమువద్ద కోతకు గురైన రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులో పడి పలువురు వాహనదారులకు గాయాలయ్యాయి.

ఎందుకీ నిర్లక్ష్యం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తక్షణం మరమ్మతులు నిర్వహించమని ఆదేశాలు ఇస్తే పనులు ఇలా తూతూమంత్రంగా నిర్వహించి అసంపూర్తిగా వదిలివేస్తారా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 58రోజులుగా పనులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై వారు మండిపడుతున్నారు. పనులు చేసేందుకు తారు అందుబాటులో లేదంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్తున్న వివరణలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. పనులు పూర్తయి ఉంటాయని డిప్యూటీ సీఎం పేషీ అధికారులు భావిస్తుంటే వాస్తవంలో ప్రజలు కష్టాలు ఇప్పుడు రెట్టింపయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ ఈ రహదారి దుస్థితిపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడంతోపాటు అరకొర ప నులు చేసి వదిలివేసిన అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడి చేసింది జనసేన కార్యకర్త కాదు

- కుడా చైర్మన్ తుమ్మల బాబు



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల బాబు

పెద్దాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముద్రగడ పద్మనాభరెడ్డి ఇంటిపై దాడి చేసింది జనసేన పార్టీ కార్యకర్త కాదని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జనసేన కార్యకర్తలు ఎవరూ గూండాలు కాదన్నారు. రౌడీ రాజకీయాలకు జనసేన వ్యతిరేకమన్నారు. ముద్రగడ ఇంటిమీద దాడి చేయడం అనేది బాధాకరమైన విషయమన్నారు. జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఈ దాడిని ఖండిస్తున్నానన్నారు.

నీతిమాలిన రాజకీయాలు వద్దు

- వైసీపీ నేతల తీరుపై ఎంపీ సానా సతీష్ మండిపాటు



కాకినాడసిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముద్రగడ ఇంటి వద్ద జరిగిన ఘటనపై వైసీపీ నేతలు రాద్ధాంతం చేయడాన్ని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఖండించారు. తాగిన మైకంలో ఆకతాయి చేసిన చేష్టలను రాజకీయంగా వాడుకోవాలని చూడడం నీతిమాలిన చర్యగా అభిప్రాయపడ్డారు. ఆకతాయి ఘటనకు కూడా వైసీపీ నేతలు ముద్రగడ ఇంటికి క్యూకట్టడం చూస్తుంటే నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ తరహా రాజకీయాలను మానుకుని హుందాగా వ్యవహరించాలని వైసీపీకి సూచించారు. తాగుబోతును పోలీసులు విచారించి ఆకతాయి చర్యగా తేల్చినా వైసీపీ రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు.

పొన్నాడ బంగారు ఉరుస్ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



పొన్నాడలో బంగారుపాప దర్శనం చేసుకున్న ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

కొత్తపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 7నుంచి 9 వరకు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో జరిగే బంగారుపాప(బషీర్‌బీబీ ఔలియా) ఉరుస్ ఉత్సవాల ఏర్పాట్లను ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదివారం పరిశీలించారు. తొలుత బంగారుపాప దర్శనం చేసుకొన్నారు. బంగారుపాప ఆలయ చరిత్రను స్థానిక ముజావర్లు ఏఎస్పీకి వివరించారు. అనంతరం వచ్చే శుక్రవారంనుంచి ఆదివారం వరకు బంగారు పాప ఉరుస్‌ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్‌ను ఆదేశించారు.

రగ్బీ క్రీడాభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు

పిఠాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రగ్బీక్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాసకుమార్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికకు క్రీడాభివృద్ధి అధికారి పరిశీలకుడిగా హాజరయ్యారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడిగా పాలపర్తి దొరబాబు, ఉపాధ్యక్షుడిగా సోము గోవిందరాజు, కార్యదర్శిగా పి.కృష్ణ, సహాయ కార్యదర్శిగా మానేపల్లి చైతన్య, కోశాధికారిగా బి.నవీన్, ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులుగా ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, జే.ప్రసాదరావు, కె.చిన్నబ్బాయి, బి.సతీష్, లండాసతీష్, బి.వంశీ, డి.అఖిల్, పి.సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గోదారంతా.. ఘాట్!



పుష్కరాలకు అటూ ఇటూ ఒకటే ఘాట్

- 2027 పుష్కరాలకు ఏర్పాట్లు
- 17 ఘాట్ల విస్తరణకు యోచన
- ఇప్పటి నుంచే ప్రణాళిక
- రూ.300 కోట్లతో ప్రతిపాదన
- రాజమండ్రి వైపు 7.1 కి.మీ
- కొవ్వూరు వైపు 2 కి.మీ
- ఎంపీ పురందేశ్వరి ఆదేశాలు
- అధికారుల తర్జనభర్జన
- ఏటిగట్టు రోడ్లు నిర్మాణం

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) :గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ముందస్తు చర్యలకు దిగుతున్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి పరీవాహక ఘాట్లు లింక్ చేసే యోచన చేస్తున్నారు. రాజమహేంద్రవరం వైపు కాతేరు నుంచి ధవళేశ్వరం వరకూ 7.1 కి.మీ, కొవ్వూరు వైపు గోష్పాదక్షేత్రానికి అటూ ఇటూ విస్తరించనున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని 2027లో జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది.ఇప్పటి నుంచే గోదావరి పుష్కరాలకు సర్వం సన్నద్ధం కావడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలో గోదావరి పరిసర గ్రామాలన్నింటికీ పుష్కర శోభను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తుంది.

గత పుష్కరాలకు ఇలా..

రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవుకు దీటుగా 2003 పుష్కరాలకు కోటిలింగాల రేవును అప్పటి టీడీపీ ప్రభుత్వం 1.2 కిమీ విస్తరించింది.అప్పట్లో ఈ ఘాట్‌లోనే అత్యధికంగా భక్తజనం పుణ్యస్నానాలు ఆచరించారు. 2003 పుష్కరాలకు ఘాట్ల అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయింపులు చేశారు.అప్పట్లోనే కొవ్వూరు గోష్పాదక్షేత్రం ఘాట్‌ను అభివృద్ధి చేశారు. అటుపై 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు, సర్వస్వతి ఘాట్ అభివృద్ధి చేశారు.పుష్కరాల రేవు కేవలం ప్రధాన మంచినీటి విభాగం సరిహద్దు గోడ నుంచి ఆర్చి బ్రిడ్జి వరకు మాత్రమే ఉండేది దానిని చిత్రాంగి గెస్ట్ హౌస్ వెనుక వరకు విస్తరించారు.నాటి పుష్కరాల్లో పుష్కరాల రేవు,కోటిలింగాలరేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్, కాతేరు రేవు, ధవళేశ్వరం రేవులు ప్రధాన భూమిక పోషించాయి.అయినా రద్దీ అంతా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు, కోటిలింగాల రేవులపై పడేది. ఈ నేపథ్యంలో గత రెండు పుష్కరాల అనుభవాలు, ప్రస్తుతం ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళాను దృష్టిలో పెట్టుకుని తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి పొడవునా ఉన్న రేవులను ఈ సారి పుష్కరాలకు వినియోగించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమౌతుంది.

రోడ్లు విస్తరణ


పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రేవులకు అనుసంధానంగా ఉన్న గోదావరి బండ్ రోడ్డును విస్తరించే యోచనలో ప్రజాప్రతినిదులు అధికారులు ఉన్నారు. ధవళేశ్వరం సాయిబాబా ఆలయం నుంచి ఉన్న గోదావరి బండ్ రోడ్డును రాజమహేంద్రవరం బండ్ రోడ్డు,శేషయ్యమెట్ట మీదుగా కోటిలింగాల రేవు, కాతేరు, వెంకటనగరం మీదుగా ఏటిగట్టును బేస్ చేసుకుని గోదావరి బండ్ రోడ్డును నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పుష్కరాలకు కోట్లాదిగా తరలి వచ్చే భక్తజనం రాజమహేంద్రవరం వరకు రాకుండానే రూరల్‌లో గోదావరి బండ్ రోడ్డులోకి వెళ్లి అక్కడ అభివృద్ధి చేసిన ఘాట్ల స్నానాలు చేసి తిరుగు ప్రయాణం అయ్యే విధంగా బండ్ రోడ్డుకు మెయిన్ రోడ్లను కనెక్ట్ చేసి నిర్మించాలనే చర్యలు అధికారులు చేపట్టనున్నారు.



2027 గోదావరి పుష్కరాలకు ఇలా..

గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం, కొవ్వూరు ఘాట్లలో భక్తజనం పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఈ మేరకు ప్రధానంగా ఉన్న ఘాట్లను ఇంటర్ లింక్ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టనున్నారు. ఎంపీ పురందేశ్వరి కూడా రాజమహేంద్రవరం, కొవ్వూరులో ఘాట్లను లింక్ చేయాలని ఆదేశించారు.ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నగరంలో ఉన్న కోటిలింగాల రేవు నుంచి కాతేరుకు, ఇటు వైపు పుష్కరాల రేవు, కుమారి ఇసుక ర్యాంప్ రేవు, టీటీడీ ఘాట్, శ్రద్ధానంద ఘాట్, దోబీఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్, ధవళేశ్వరం రామపాదాల రేవులను ఇంటర్‌లింక్ చేసి సుమారు 7.1 కిలోమీటర్ల పొడవునా అతిపెద్దగా ఘాట్లను నిర్మించాలనే ఆలోచన అధికార యంత్రాంగం చేస్తుంది. అదే విధంగా కొవ్వూరు వైపు సుమారు 4 కిలోమీటర్ల మేర అఖండ గోదావరి విస్తరించి ఉంది.అక్కడ కూడా గోష్పాదక్షేత్రం నుంచి 2కి.మీ. రేవులను విస్తరించే యోచనలో యంత్రాంగం ఉంది.2027 గోదావరి పుష్కరాలకు ఘాట్ల ఇంటర్ లింక్‌లు కలిపి మొత్తం 17 ఘాట్లను సిద్ధం చేసేందుకు సుమారు రూ.300 కోట్లు నిధులు కేటాయింపులు చేసే యోచనలో ఉన్నారు. ఇదే జరిగితే పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానాలు చేసి వెళ్లే పరిస్థితి ఉంటుంది.అన్ని రేవులను కలిపి పుష్కరాల రేవుగా నామకరణ చేసి బోర్డులు కూడా అందరికి స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేయాలనే ఆలోచన అధికారులు చేస్తున్నారు.ఎందుకంటే 2015 పుష్కరాలకు పుష్కరాల రేవు వద్ద తొలిరోజు జరిగిన ప్రమాదంలో 22 మంది వరకూ మృత్యువాత పడిన ఘటన విదితమే.ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రేవులు లింక్ చేసేయోచన చేస్తున్నారు.

రద్దీకి తగ్గట్టు ఘాట్ల విస్తరణ



2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ప్రస్తుతం జరుగుతున్న మహాకుంభమేళాకు వచ్చిన భక్తజనానికి మించి భక్తులు వచ్చే అవకాశం ఉంది. అందుకే రద్దీకి తగ్గట్టుగా ఘాట్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటుంది. అన్ని ఘాట్లు పుష్కరఘాట్లే ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుష్కర పుణ్యమే అనే ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని రేవులకు ప్రజలు సమాంతరంగా వచ్చే విధంగా ప్రణాళికను ప్రభుత్వం చేస్తుంది. 2027 గోదావరి పుష్కరాలకు కూటమి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటి నుంచే పుష్కరాల అభివద్ధి పనులు చేపడుతున్నందున అన్ని సకాలంలో పూర్తవుతాయి.

- ఆదిరెడ్డి శ్రీనివాస్,ఎమ్మెల్యే
రాజమహేంద్రవరం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నేడు గ్రీవెన్స్ రద్దు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయదలిస్తే సంబంధిత సచివాలయంలో మీకోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాకినాడ బీచ్‌కి పోటెత్తిన సందర్శకులు



బీచ్‌లో సందర్శకుల కోలాహలం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. సాగరతీరంలో సాయం సమయాన ఆనందంగా గడిపేందుకు చిన్నారులు, యువతీ, యువకులు, పెద్దలు, కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్ బీచ్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు సముద్ర ఇసుకతో ఆటలాడుకుంటూ ఎంజాయ్ చేశారు. యువకులు, పెద్దలు సముద్రంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. సందర్శకుల రద్దీ దృష్ట్యా కాకినాడ మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మెరైన్ పోలీసులు గజ ఈతగాళ్లతో పహారా కాసి, సముద్ర స్నానం కోసం లోతుకి వెళ్లకుండా అప్రమత్తం చేశారు.



స్వామివారి సేవలకు..

సిద్ధమైన వాహనాలు

- ఒక్కో వాహనానికి ఒక్కో ప్రత్యేకత
- రేపటి నుంచి 13వ తేదీ వరకు వైభవంగా లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలు
- ఏర్పాట్ల నిమగ్నమైన అధికార యంత్రాంగం



అంతర్వేది, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామివారికి పది రోజులపాటు నిర్వహించే కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి 14 వాహనాల్లో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఆర్తజన రక్షకుడైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహుడికి పది రోజులపాటు జరిగే కల్యాణోత్సవాలను చూసేందుకు రెండు కనులు చాలవు. వీటిని చూసి తరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామి వారికి జరిగే ముద్రికాలంకరణతో ప్రారంభమై స్వామివారి పవళింపు సేవతో ముగుస్తాయి.

కల్యాణోత్సవాల కోసం వాహనోత్సవాలు

సూర్యవాహనం



కల్యాణోత్సవాల్లో తొలిరోజు ఫిబ్రవరి 4న మంగళవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రదాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్య ప్రభాససమేతుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు సాయంత్రం 4.30కు సూర్యవాహనంపై గ్రామ మాఢ వీధుల్లో ఊరేగుతారు.

గరుడ పుష్పకవాహనం



రెండో రోజు 5వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు గరుడ పుష్పకవాహనంపై ఊరేగుతారు. గరుడు వేదమూర్తి స్వామివారి వాహనం నిత్యం స్వామివారికి గరుడవాహనం ఎక్కి గ్రామోత్సవంలో పాల్గొంటారు.

పుష్పక వాహనం



రెండోరోజు బుధవారం రాత్రి 7గంటలకు స్వామివారు పుష్పక వాహనం అధిరోహిస్తారు. భక్తుల మనో రథాన్ని నెరవేర్చడం కోసం శ్రీ స్వామివారు తన హృదయమనే పుష్పంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటి చెప్పేందుకు ఈ వాహనంపై ఊరేగుతారు.

హంస వాహనం



మూడో రోజు 6వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామివారు హంస వాహనంపై ఊరేగింపుగా వెళ్తారు. పాలు, నీళ్లను వేరు చేసే శక్తి హంసకు మాత్రమే ఉంది.

శేష వాహనం



మూడోరోజు గురువారంరాత్రి 7 గంటలకు శేషవాహనంపై ఊరేగుతారు. శిష్యుడు వాక్శిమ కలిగిన వారు. సర్వ హక్కులకు అధినేత అయిన వాక్ బ్రహ్మను నేనే అని భక్తులకు తెలియజెప్పేందుకు ఆదిశేషుడిపై వేంచేస్తారు.

పంచముఖాంజనేయ వాహనం



నాల్గవరోజు 7వ తేదీ శుక్రవారం సాయంత్రం 4గంటలకు స్వామివారు అధిరోహించే వాహనం పంచ ముఖాంజనేయ. బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, భయం లేకుండుట అనే గుణాలను భక్తులకు పంచిపెట్టడం కోసం శ్రీవారు పంచముఖ ఆంజనేయ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు

కంచు గరుడ వాహనం



నాల్గవరోజు శుక్రవారంరాత్రి 8 గంటలకు కంచు గరుడవాహనంపై అధిరోహించి భక్తులకు వినత, దాత్యమును పోగొట్టేందుకు తాను ప్రయత్నించి గరుడు సఫలీకృతమై శ్రీ స్వామివారి అనుగ్రహం పొందేందుకు పంచ గరుడ వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. అదేరోజు రాత్రి దశమి 12.55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు స్వామివారి తిరు కళ్యాణం జరుగుతుంది. ఐదోరోజు 8వతేదీ శనివారం భీష్మఏకాదశి పర్వదినాన మధ్యాహ్నం 2.05 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం.

గజ వాహనం



ఆరోరోజు 9వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు గజ వాహనాన్ని అధిరోహించి ఊరేగు తారు. గజం బుద్ధికి సంకేతం. తాను వేయాల్సిన ప్రతి అడుగు భాగుగా ఆలోచించి భక్తి, జ్ఞాన వైరాగ్యం వైపు భక్తులను నడిపించేందుకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు గజ వాహనంపై ఊరేగింపునకు వెళ్తారు.

పొన్న వాహనం



ఆరో రోజు ఆదివారం రాత్రి 8 గంటలకు స్వామివారు పొన్న వాహనంపై గ్రామోత్సవానికి వెళతారు. నాది అనేద ఏదీ లేదని సర్వశ్వం నేనే అని గోపికలు కృష్ణ పదమూత్మునికి ఆత్మ నివేదన చేసిన సమయంలో శ్రీ కృష్ణ పరమాత్మపై పొన్న చెట్టుపై కూర్చుని వారి నివేదనను స్వీకరిస్తారు.

హనుమత్ వాహనం



ఏడవ రోజు 10వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు స్వామివారు హనుమత్ వాహనంపై ఊరేగింపునకు వెళతారు. హనుమంతుడు కార్యం చేయాల్సి వచ్చినప్పుడు తన దైవాన్ని స్మరించుకు నిపూర్తి చేస్తాడు. హనుమంతుడు స్వామివారిని తన భుజాలపై అధిరోహింప చేసుకుని శ్రీలక్ష్మీ నరసింహరాముని తలచుకుని భక్తులు తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి చేయవచ్చని హనుమత్‌వాహనంపై ఊరేగుతారు.

సింహ వాహనం




ఏడోరోజు సోమవారం రాత్రి 7గంటలకు సింహవాహనం అధిరోహిస్తారు. మానవుడు, మాధవుడు కలిసిన స్వరూపమే శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు. అతి మాధవ స్వరూపం సింహం నేనేనని శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పినట్లుగా లక్ష్మీనరసింహ స్వామి వారు సింహంపై అధిరోహిస్తారు.

రాజాధిరాజ వాహనం



ఎనిమిదో రోజు 11వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటలకు స్వామి వారు రాజాధిరాజా వాహనంపై ఊరేగింపునకు వెళ్తా రు.

అశ్వవాహనం



ఎనిమిదోరోజు మంగళవారంరాత్రి 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారిచే నిర్మితమైన అశ్వవాహనాన్ని స్వామివారు అధిరోహిస్తారు. మనిషిలో ఉండే జ్ఞానం జడ పదార్థంగా ఉండకుండా గుర్రం వలే చురుకుదనం త్వరితతగతిన విచ్చేందుకు స్వామివారు అశ్వ వాహనంపై దర్శనమిస్తారు.

- తొమ్మిదో రోజు 12న బుధవారం మా ఘ పౌర్ణమినాడు ఉదయం 8గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- పదోరోజు 13 సాయంత్రం 5 గంటలకు పుష్పక వాహనంపై స్వా మివారి గ్రామోత్సవం జరుగుతుంది.

కొంకాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐషర్‌వ్యాన్.. ఆటో ఢీ.. ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఒక యువతి పరిస్థితి విషమం
- కిమ్స్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధితులు



తలకు తీవ్ర గాయమై రక్తపు మడుగులో పడి ఉన్న నలబ శ్రీదేవి





చికిత్స పొందుతున్న మానుపాటి దుర్గ, గాయపడ్డ వనుము కిశోర్

అమలాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లిలో గల ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వారిలో ఒక యువతి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆటో, రొయ్యల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన ఐషర్ వ్యాన్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం పట్టణంలోని మున్సిపల్ కాలనీకి చెందిన కొందరు ఆదివారం సెలవురోజు కావడంతో అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణికులతో అమలాపురం వైపు వస్తున్న ఆటోను భీమవరంవైపు వెళుతున్న రొయ్యల కంపెనీకి చెందిన ఐషర్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. దాంతో ఆటోలో ఉన్న ఎనిమిది మందిలో ఏడుగురికి గాయాలు కాగా ఒక బాలిక మాత్రం సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడింది.

ఆటో ముందు, పక్కభాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. అయితే సంఘటనా స్థలివద్ద గాయపడ్డ వారి ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. రక్తపు మడుగులో ఉన్న బాధితులను స్థానికుల సహకారంతో 108 అంబులెన్సు వాహనంలో తొలుత అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం బాధితులను కిమ్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన బాధితుల్లో అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన నలబ శ్రీదేవి (16) పరిస్థితి విషమంగా ఉంది. తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరగడంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. మిగిలిన వారి వివరాలు ఇలా.. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మానుపాటి నాగేంద్ర (38), మానుపాటి దుర్గ (35), వనుము కిశోర్ (16), మానుపాటి నాని (14), మానుపాటి దివ్య (6), వనుము కిరణ్ (12), ఆటోడ్రైవర్ మొగిలి మహేష్ (20) తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు విరిగిపోవడం, తలకు గాయం కావడం వంటి సమస్యలతో బాధితులు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు తెలిపారు. ఓడలరేవులో సరదాగా గడిపి మరికొన్ని క్షణాల్లో ఇంటికి చేరకుంటామన్న తరుణంలో ఈప్రమాదం జరగడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వీరంతా ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు.

పిఠాపురంలో అంతర జిల్లా నేరస్తుడి అరెస్టు

- 48 మోటార్‌సైకిళ్లు స్వాధీనం
- కాకినాడ, అనకాపల్లి జిల్లాల కేసుల్లో అరెస్టు
- అదుపులో ఆరుగురు కొనుగోలుదారులు
- వెల్డింగ్ పని చేస్తూ వ్యసనాలకులోనై చోరీలు
- వెల్లడించిన కాకినాడ ఎస్పీ బిందుమాధవ్





పిఠాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు, అంతరజిల్లా నేరస్తుడిని అరెస్టు చూపుతున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

పిఠాపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతరజిల్లా నేరస్తుడిని పిఠాపురం పోలీసులు అరెస్టుచేసి 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోటార్‌సైకిళ్లను కొనుగోలు చేస్తు న్న ఆరుగురుని ముద్దాయిలుగా చేర్చి వారిని అదుపులోకి తీసుకున్నారు. పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పట్టణం, రూరల్, కొత్తపల్లి, గొల్లప్రోలు, సర్పవరం, తునిటౌన్, తొండంగి, అన్నవరం పోలీసుస్టేషన్లు, అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 48కిపైగా మోటార్‌సైకిళ్లు చోరీకి గురయ్యాయి. చోరీలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్, కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు, క్రైమ్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఇతను మంకీకేప్, మాస్క్ ధరించి ముఖం కనబడకుండా కొంతకాలంగా బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న సంఘటనలు జరగడంతో ఈ కేసులను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సంక్రాంతి రోజున జరిగిన బైక్ చోరీ సంఘటనలో సీసీ కెమెరాలు, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి పిఠాపురం పట్టణం అగ్రహారం ప్రాంతానికి చెందిన సొంటిని గంగాధర్ అలియాస్ రీసు గంగాధర్‌ను అరెస్టుచేశారు. విచారించగా ఇతను రెండేళ్ల కాలంలో తొమ్మిది పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. 48 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతను గతంలో కూడా చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పిఠాపురం పట్టణంలో నమోదైన 15 కేసుల్లో ఇతనిని అరెస్టు చూపించారు. ఇతని వద్ద నుంచి మోటార్‌సైకిళ్ల కొనుగోలుచేసి ఇతరులకు విక్రయిస్తున్న ఆరుగురుని గుర్తించి వారిని ముద్దాయిలుగా చేర్చి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని ప్రస్తుతం విచారిస్తున్నారు. గంగాధర్ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగించే వాడు. వ్యసనాలకు లోనై కొంతకాలంగా చోరీలకు అలవాటు పడినట్లు చెబుతున్నారు. ఇతనికి ఎవరైనా సహకరించారా అనే అంశంపై పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును పకడ్బందీగా విచారించి నిం దితుడిని అరెస్టు చేసి భారీగా మోటార్‌సైకిళ్ల స్వాధీనం చేసుకున్న సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీబాషా పాల్గొన్నారు.

పరిచయం పెంచుకుని బైక్‌లు అమ్మాడు

మోటార్‌సైకిళ్లకు చోరీకి పాల్పడిన గంగాధర్ ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో దొంగలించిన బైక్‌లు కొని అమ్మేవారితో 2023 నుంచి పరిచయాలు పెంచుకున్నాడు. పెళ్లయిన తర్వాత చెడు అలవాట్లకు లోనయిన గంగాధర్ నకిలీ తాళాలు ఉపయోగించి మోటార్‌సైకిళ్లను చోరీ చేసేవాడు. ఈవిధంగా చోరీ చేసిన బైక్‌లను రెండు మండలాలుకు చెందిన కార్తిక సత్తిబాబు, కురుమళ్ల వీరబాబు, గనాసుల ఆనంద్, తోట లక్ష్మణరావు, ఏనుగపల్లి నాగ సత్యనారాయణ, వట్టికోళ్ల చక్రయ్యలకు ఒక్కొక్క బైక్‌ను రూ.10వేలు వంతున విక్రయించే వాడు. వచ్చిన సొమ్మును జల్సాలుకు వినియోగించే వాడు. ఈఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు అదుపులోకి తీసుకున్నారు

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



నిమ్మన శివనాగకృష్ణ (ఫైల్)


ముమ్మిడివరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యం కేసులో పోలీసులు వేధింపులకు గురి చేయడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం గేదెల్లంకలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముమ్మిడివరం మండలం గేదెల్లంకకు చెందిన నిమ్మన శివనాగకృష్ణ (32) భార్య సాయిరేవతి, తల్లిదండ్రులు వెంకటరమణ-శేషగిరిరావుతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్ వ్యాపారంపెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అక్కడ ఓ వివాహిత అదృశ్యం కావడం.. ఆమె భర్త పోలీసు శాఖలో పనిచేయడంతో.. శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, భయాందోళన చెంది శివనాగకృష్ణ హైదరాబాద్ నుంచి శనివారం స్వగ్రామం గేదెల్లంక వచ్చాడు. శివనాగకృష్ణ శనివారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో అతడిని బంధువులు మురమళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. శివనాగకృష్ణ సుమారు 15 ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్ ఎల్బీనగర్ మనుసూరాబాద్‌లో పండ్లు, జ్యూస్‌లషాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. 11 నెలల క్రితం సాయిరేవతితో వివాహమైంది. పెళ్లి అయిన తరువాత భార్యను కూడా హైదరాబాద్ తీసుకువెళ్లాడు. ఇటీవల అక్కడ పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగి భార్య అదృశ్యం వెనుక శివనాగకృష్ణ ప్రమేయం ఉందని పోలీసులు వేధించడంతో మనస్తాపం, ఆందోళన చెందిన శివనాగకృష్ణ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని బంధువులు చెబుతున్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి పరీక్ష

పెద్దాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయలో 9,11 తరగతిలో ప్రవేశానికి ఈనెల 8న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు నవోదయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. ఈప్రవేశ పరీక్ష పెద్దాపురంలో 9 సెంటర్లలో జరుగుతుందన్నారు. తొమ్మిదో తరగతికి 1451మంది, 11వ తరగతికి 699 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు.

గ్లకోమాను సకాలంలో గుర్తించాలి

- జీఎస్ఎల్‌లో అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య నిపుణులు

రాజానగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా అంతర్జాతీయ సదస్సును గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సహకారంతో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్, ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా జాన్స్ హాప్ కిన్స్ యూనివర్శిటీ (యుఎస్ఏ)కి చెందిన డాక్టర్ థామస్ వి.జాన్సన్ ధనవంత్రి గురించి వివరించారు. గ్లకోమాలో న్యూరోప్రొటెక్షన్, గ్లకోమాకు సంబంధించిన సమస్యలను వివరించారు. గ్లకోమా, రెటీనీ కణాల మార్పిడి గురించి తెలియజేశారు. కార్నెల్ మెడ్ సెంటర్ న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ చార్లెస్ కోల్ సుశ్రుత కీలకోపాన్యాసం చేశారు. గ్లకోమా కోసం శస్త్రచికిత్స సమయాల్లో తీసుకునే సాహసాల, విధానాలపై వివరించారు. గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్, సీనియర్ వైద్య నిపుణులు గ్లకోమా రోగులకు లేజర్ చికిత్స, విధి విధానాలపై ప్రదర్శన ద్వారా వివరించారు. బాలల అంధత్వాన్ని నిర్మూలించడం కోసం ప్రత్యేకంగా అందిస్తున్న సేవలను యుఎస్ నుంచి విచ్చేసిన పారిశ్రామిక వేత్త, వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీను మద్దుల కార్నియా స్పెషలిస్ట్ గౌతమి ఐ ఇన్‌స్టి ట్యూట్ చైర్మన్ డాక్టర్ వీకె రాజును ప్రశంసించారు. అమెరికాకు చెందిన డాక్టర్ లీలారాజు ముఖ్యఅతిథులను పరిచయం చేస్తూ సదస్సు ప్రాధాన్యతను వివరించారు. పలు విద్యాసంస్థలకు చెందిన ఆప్తమాలిక్ మెడికోలు, విద్యార్థులకు కంటి వ్యాధులపై ప్రదర్శనలు ద్వారా వివరించారు. అనంత రం గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ చాన్సలర్ కేవీవీ సత్య నారాయణరాజు (చైతన్యరాజు)ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గౌతమి మేనేజర్ డైరెక్టర్ వీవీ కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నయన కంటి ఆసుపత్రి వైద్యుడు శ్రీరాం, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ డాక్టర్ ప్రజ్ఞ పరిశీలకులుగా వ్య వహరించారు.


నల్లకుంటలో మూడిళ్లు బుగ్గి

- రూ.15 లక్షలు ఆస్తి నష్టం

ఎటపాక, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు బుగ్గి అయ్యాయి. రూ.15లక్షల ఆస్తి నష్టం జరిగిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తొలుత ఊయిక వీరమయ్య ఇంటికి నిప్పంటుకుంది. ఆమంటలు దావానంలా వ్యాపించి పక్కనే ఉన్న తెల్లం రాములమ్మ ఇంటికి నిప్పంటుకుంది. ఆపైన కలముల ధనలక్ష్మి ఇంటికి మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలింత ధనలక్ష్మి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చారు. ఆలోపే ఇళ్లన్నీ కాలిపోయాయి. రాములమ్మ ఇంట్లోని మూడు కాసుల బంగారంతో పాటు ధాన్యం బస్తాలు, గృహోకరణాలు దగ్ధమయ్యాయి. ఊయిక వీరమయ్య ఇంట్లో బీరువాలో ఉంచిన రూ.1.50లక్షల నగదుతో పాటు బంగారం, ధాన్యం,పట్టాదారుపాస్‌పుస్తకాలు, గృహోపకరణాలు కాలిపోయాయి. ధనలక్ష్మి ఇంటి బీరువాలోని బంగారు తాడు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో కన్నమ్మ నష్టాన్ని అంచనా వేసి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంతో మూడు కుటుంబాలకు చెందిన గిరిజనులు కట్టుబట్టలతో మిగిలారు.

మాజీ మంత్రి ముద్రగడ ఇంటి వద్ద ఉద్రిక్తత

- ఇంటి గేటును ఢీకొట్టిన మతిస్థిమితం లేని వ్యక్తి
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



దాడికి కారణమైన యువకుడు

కిర్లంపూడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి నివాసంలో ఆదివారం తెల్లవారుజామున నాలుగుగంటల సమయంలో ఒక యువకుడు బీభత్సం సృష్టించాడు. ర్యాంపుపై ఉన్న కారును ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. ఈ అలజడికి ఇంట్లో నుంచి ముద్రగడ కుటుంబీకులు బయటకు వచ్చారు. అక్కడున్న వారు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని మండలం జగపతినగరం గ్రామానికి చెందిన గనిశెట్టి గంగాధర్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ సిబ్బందితో ముద్రగడ నివాసానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కిర్లంపూడి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ముద్రగడను కలిశారు. మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, తోట నరసింహం, చెల్లుబోయిన వేణు, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ వంగా గీత ముద్రగడ పద్మనాభం, గిరిబాబులను కలిసి ఏం జరిగిందని ఆరా తీశారు.

కాకినాడ

8న ఉప్పాడలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 8న భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు శ్రీలక్ష్మీనారాయణ సేవా సమాజం పేర్కొంది. ఉదయం 6 గంటల నుంచి తెల్లారే వర కు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరింది.

పుష్‌కార్ట్‌ల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ

డ్రెయిన్లల్లో పూడిక తొలగింపు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదికతో పారిశుధ్య సమస్యలకు పరిష్కారం



పిఠాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పుష్‌కార్ట్‌ల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ, డ్రెయిన్లల్లో పూడిక తొలగింపు, వీధుల్లో చెత్తాచెదారం తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలింపు ఇలా అక్కడ పారిశుధ్య సమస్యలకు పరిష్కారం చూపించింది ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదిక. గతంలో నెలకు ఒకసారి కూడా డ్రెయిన్లల్లో పూడిక తొలగించేవారు కాదని, ఇప్పుడు ప్రతి రోజూ ఏదొక సమయంలో డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకుగానూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా పిఠాపురం 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయం వద్ద నిర్వహించిన చర్చావేదికలో వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ, ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పారిశుధ్య సమస్యను ప్రధానంగా ప్రస్తావించారు. వీధుల్లో చెత్తాచెదారం సక్రమంగా తొలగించడం లేదని, ఇంటింటా చెత్త సేకరణ జరగడం లేదని, డ్రెయిన్లల్లో రోజులు, నెలల తరబడి పూడికలు తీయడం లేదని వివరించారు. దీనిపై మున్సిపల్ కమిషనరు నామా కనకారావు స్పందించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారు. శానిటరీ ఇనస్పెక్టర్ ప్రభాకర్‌తో పాటు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో రోజూ పారిశుధ్య నిర్వహణ జరగాలని ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఆరుగురు సిబ్బందిని నియమించారు. వారు వీధుల్లో రోజూ చెత్తాచెదారం తొలగించడం ద్వారా పుష్‌కార్ట్‌ల ద్వారా ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారు. డ్రెయిన్లల్లో పూడికను తొలగించడంతో పాటు శుభ్రం చేస్తూ లార్వా నివారణకు ప్రత్యేక మందును పిచికారీ చేశారు.



పిఠాపురం 18వ వార్డులో పుష్‌కార్టు ద్వారా ఇంటింటా చెత్తను సేకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది, 18వ వార్డులో డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న దృశ్యం

సమస్యలను పరిష్కరించుకోవాలి

జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సంఘటితంగా ఉంటూ రవాణా రంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆవరణలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకరికొకరు సహకరించుకుంటూ రవాణా రంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసి కోరాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జిల్లా గౌరవ సలహాదారులుగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, చిర్ల అమ్మిరెడ్డి, నల్లా రాంబాబు, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి వ్యవహరించనున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గొలుగూరి ధర్మారెడ్డి, కాయల రమేష్, కార్యదర్శిగా బొక్కా వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా కవల సురేష్, వాకాడ కనకరాజు, కోశాధికారిగా విక్రం దుర్గా శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కర్రి సుధాకరరెడ్డి, కిలపర్తి భాస్కరరావులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పూలదండలతో సత్కరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని అధిక సంఖ్యలో అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సర్పవరంలో ఘనంగా మాఘ తిరునాళ్లు



భావనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఆవరణలో పాల పొంగులు తయారు చేస్తున్న భక్తులు


సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా తిరునాళ్ల నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని ముక్తికా సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సూర్యభగవానుడికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవు పిడకలతో పొయ్యిలు ఏర్పాటు చేసి దానిపై పాల పొంగులు తయారు చేసి స్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం పాలపొంగలి, మొతలకెత్తిన పెసలు, రేగుపళ్లు, చెరకు ముక్కలు, అరటి పండ్లను స్వామిని ప్రార్థిస్తూ గాల్లోకి ఎగురవేశారు. గాల్లోకి ఎగరవేసిన ప్రసాదాన్ని మహిళలు చీరకొంగులతో ఒడిసి పట్టుకునేందుకు పోటీ పడ్డారు.

ఎక్కడవేసిన గొంగళి అక్కడే!

గోదావరి కలుషిత జలాలు అరికట్టేనా

3 మున్సిపాల్టీలకు తాగునీరు కలుషితం

ప్రతీ ఏటా మహాశివరాత్రి ఉత్సవాలకు కాలుష్యనినాదం



గోదావరి కాలువలోకి చేరిన కలుషిత జలాలు

సామర్లకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం నుంచి సామర్లకోట వరకూ గోదావరి జలాలు ప్రవహించే తూర్పుడెల్టా కాలువ సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం నుంచి సామర్లకోట వరకూ గోదావరి జలాలు కలుషితం కావడం సాధారణంగా మారింది. సుదీర్ఘ కాలంగా పలు ఎన్నికల్లో ఈ కలుషితజలాలు నిరోధిస్తాం అంటూ ఆయా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు నినాదంగా మారుతున్నప్పటికీ అధికారంలోకి వచ్చాక కలుషిత జలాలను నిరోధించడంలో ఏ ఫలితం లేకపోవడంతో కాలుష్యజలాల సమస్య ఎక్కడవేసిన గొంగళి అక్కడే చందాన మారింది. పెదబ్రహ్మదేవం పంచాయతీ మురుగునీరు నుంచి జీ.మేడపాడు పంచాయతీకి చెంది 3 మురుగునీటి అవుట్‌లెట్‌లు, అదే గ్రామ శివారులో ఉన్న ఒక పరిశ్రమ నుంచి వెలువడు కలుషిత జలాలు, వేట్లపాలెం పంచాయతీకి చెంది 3 మురుగునీటి అవుట్‌లెట్‌లు మాత్రమే గాకుండా 3 చిన్న పరిశ్రమల నుంచి వెలువడు కలుషిత జలాలు, పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఉన్న ప్రముఖ భారీ పరిశ్రమల నుంచి వెలువడు కలుషిత జలాలు, హుస్సేన్‌పురం వద్ద పంచాయతీ మురుగునీరు అవుట్‌లెట్‌లు, ఒక పరిశ్రమ నుంచి వెలువడు కలుషిత వ్యర్థ జలాలు నేరుగా తూర్పుడెల్టా కాలువ అనే ఈ గోదావరి కాలువలోనే నేరుగా కలవడంతో జలాల రంగుమారి దుర్గంధపూరితమవుతున్నాయి. ఇలా ఏడాదిలో నిరంతరం కలుషిత జలాలు కలుస్తూనే ఉన్నప్పటికీ వేసవి సీజన్‌లో గోదావరి కలువలో నీటి విడుదలలు తగ్గడం అదే సమయంలో సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీలకు, కాకినాడ నగరపాలక సంస్థలకు చెంది ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ప్రారంభంకావడంతో కలుషిత జలాల సమస్య తెరపైకి వస్తుంది. కలుషిత జలాల వల్ల ఆయా మున్సిపాల్టీల ఫిల్టర్‌వాటర్ స్కీంలకు చెంది ఫిల్టర్లు సైతం పనిచేయని రీతిలో మారి ప్రజలకు కలుషిత జలాలు తాగునీరుగా సరఫరా చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో పంచారామ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచీ విచ్చేసే భక్తులు పవిత్ర గోదావరి పుష్కరిణిలో స్నానాలు ఆచరించేందుకు కలుషిత జలాలు పెద్ద అవరోధంగా మారాయి. దీంతో భక్తులు సమీపంలో ఆలయం అధికారులు ఏర్పాటుచేసే జల్లుస్నానఘట్టాలను మాత్రమే వినియోగిస్తూ మమ అని పిస్తున్నారు. మహా శివరాత్రి ఉత్సవాలకు చెందిన వివిధ ఏర్పాట్లపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో ఆలయ అధికారులు నిర్వహిం చిన సమావేశంలో భక్తులు, ప్రజా ప్రతినిధులు గోదావరి కలుషిత జలాలపై గగ్గోలు పెట్టారు.

అధికారుల పర్యవేక్షణ అవసరం

గోదావరి కాలువలో పరిశ్రమల నుంచి వ్యర్థ కలుషిత జలాలు కలువకుండా గ్రామ పంచాయతీల నుంచి మురుగునీరు కలువకుండా పటిష్టమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం తరపున ఉన్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యవేక్షించాల్సిఉంది. గతేడాది అధికారులు నిర్వహించిన తనిఖీల కారణంగా పంచాయతీ అవుట్‌లెట్లు మూసివేయాలని పంచాయతీ అధికారులకు నోటీసులు జారీ చేశారు తప్ప కార్యచరణ చూపలేకపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ ఏటా సీజనల్ పరిశ్రమలు నిర్వహణకు కాలుష్యనియంత్రణ పరికరాలు అమలుచేశారా, లేదా అనే అంశాలపై క్షుణ్ణంగా పీసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఆ రీతిలో చేసిన దాఖలాలు లేవనే ఫిర్యాదులు అనేకం ఉన్నాయి.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సామర్లకోటలో రైల్వే డీఆర్‌ఎం తనిఖీలు



సామర్లకోటలో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం పాటిల్

సామర్లకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌ను అమృత్ స్టేషన్ స్కీం పేరిట రూ.15.13 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న విషయం విదితమే. దీంతో ఈ పనులను ఎంతమేర పూర్తి చేశారు, ఏపే నాణ్యతా ప్రమాణాలు అవలంబిస్తున్నారు, లక్ష్యం పూర్తయ్యేందుకు పనులు వేగవంతం వంటి అంశాలపై స్టేషన్ ఆవరణలోని అన్ని ప్రాంతాలను డీఆర్‌ఎం క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో సర్క్యులేటింగ్ ఆవరణలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భారీ వృక్షాలను తొలగించడాన్ని పరిశీలించి అధికారులను తప్పుబట్టారు. స్టేషన్ ముందుభాగంలో బ్యూటిఫికేషన్ పనులను వేగవంతం చేయాలని డీఆర్‌ఎం ఆదేశించారు. టిక్కెట్లు తీసుకునే ప్రాంతంలో ప్రయాణికులు నిలుచునే హాలును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేసే బ్లాక్‌ను డీఆర్‌ఎం పరిశీలించి సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరుపై స్థానిక మహిళా ఉద్యోగి దేవిని డీఆర్‌ఎం ప్రశ్నించి సమాచారాన్ని రాబట్టారు. అన్ని ప్లాట్‌ఫాంలపై ఉన్న షెడ్ల నుంచి వర్షాకాలంలో పైనుంచి నీరు లీకులు కారణంగా ప్రయాణికులు తడిసిముద్దవుతున్నారని డీఆర్‌ఎం దృష్టికి ఫిర్యాదులు రాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఎం వెంట సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, విజయవాడ నుంచి డీఆర్‌ఎం వెంట ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) కొండా శ్రీను వాసు, సీనియర్ డీవోఎం నరేంద్ర వర్మ, డీసీఎం అలీఖాన్, సీనియర్ డీఈఎన్ నార్త్ గౌతమ్, సీనియర్ డీఈఎన్ హెచ్‌ఎం ఎం.కిషన్, సీనియర్ డీఈఈ మెయిన్‌టెనెన్స్ సురేష్‌బాబులు ఉన్నారు.

సదుపాయాలు కల్పించాలి : రాజప్ప

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో రైల్వే ట్రాక్ ఉన్న జీ.మేడపాడు, పెదబ్రహ్మదేవం గ్రామాల వద్ద అండర్‌పాస్ రూట్, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించి గ్రామస్తులకు మాత్రమే గాకుండా సమీప గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు సదుపాయాలు కల్పించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌కు వినతులు అందజేశారు. సత్వరం స్పందించిన డీఆర్‌ఎం మాట్లాడుతూ స్థానిక రైల్వే అధికారులతో పరిశీలన చేసేలా ఆదేశిస్తామన్నారు. రాజప్ప వెంట టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ ఉన్నారు.

కూటమి అభ్యర్థి పేరాబత్తుల విజయానికి కృషి



పిఠాపురంలో సమావేశంలో పాల్గొన్న సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే వర్మ

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు గోవింద సత్యనారాయణ

పిఠాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల మాదిరిగానే ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రికార్డుస్థాయి మెజార్టీతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం సాధించేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి.గోవింద సత్యనారాయణ సూచించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గ స్థాయిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కూటమి నాయకులతో కలిసి ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించి ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని అభ్యర్థించాలని తెలిపారు. ఓటర్ వెరిఫికేషన్ ఇప్పటికి 60శాతం పూర్తయిందని, నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. నాన్ లోకల్ ఓటర్లను గుర్తించి వారిని కలిసే కార్యక్రమం చేపట్టాలన్నారు. వర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న పట్టభద్రుల ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరించామన్నారు. ప్రతి 30మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమించి వారిని నిరంతం కలిసేలా ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ ప్రతినిధులున్నారు.

రాజశేఖర్‌ను గెలిపించుకోవాలి

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండ బాబు పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై క్లస్టర్, డివిజన్, ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే కొండబాబు తమ నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని ఆయన కోరారు.

శక్తివంచన లేకుండా కృషి

తాళ్లరేవు/యానాం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించడానికి కూటమి నాయకులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండల టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 2500 ఎమ్మెల్సీ ఓట్లు కూటమి అభర్థికి వచ్చేలా చూడాలన్నారు.



తాళ్లరేవు: సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

తాటిపర్తిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో సూర్యనారాయణస్వామి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన సూర్యనారాయణస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. మాఘమాసం తొలి ఆదివారం సందర్భంగా పంచామృత సహిత సుగంధ ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. తులసి పత్రి పుష్పార్చన చేశారు. క్షీరాన్నం వండి స్వామికి నివేదన చేశారు. అర్చకుడు ప్రభాకరశాస్త్రి పూజలు నిర్వహించారు.

చిత్తడి నేలల దినోత్సవం

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలోని బీఆర్ మున్సిపల్ బాలికోన్నతపాఠశాలలో ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఏపీ అటవీ శాఖ, ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా సుమారు 179 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఎంఎస్ వినీల్ మాట్లాడుతూ ఎన్నో జీవరాశులు, మొక్కలకు చిత్తడి నేలలు ఆవాసంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయన్నారు. పోటీల్లో విజేతలకు ప్రతిభా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ఎస్.వీరభద్రరావు, ప్రధానోపాధ్యాయులు మూర్తి, బాలవేదిక కన్వీనర్ ఎన్.బలరామకృష్ణ, ఎన్‌జీసీ ప్రాంతీయ సమన్వయకర్త కేఎస్ రావు, ఎల్.శ్రీహర్ష ఉన్నారు.

సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా భావన

సామర్లకోట, ఫిబ్రవరి 2: (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్. భావన సోమవారం ఉదయం సామర్లకోట మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఇండిపెండెంట్ చార్జిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు కమిషనర్‌గా భావన 20 రోజుల పాటు విధులు నిర్వర్తించనున్నారు. ఇప్పటికే కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీవిద్య ప్రస్తుతం సెలవులో ఉన్న విషయం విదితమే.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం పట్టభద్రుల ఎమ్మెల్సీ కోడ్ కారణంగా రద్దు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వివరించారు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయాల్సి ఉంటే సంబంధిత సచివాలయంలో మీ కోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని కోరారు.

నేడు చేబ్రోలులో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని మల్లవరం సెంటర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల పట్టాభిషేకం, శ్రీకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు సోమవారం జరగనున్నాయి. అనంతరం అన్నదానం ఉంటుంది. బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పాల్గొంటారని ఆలయ నిర్మాణ, భూదాతలు శీరం సుబ్బారావు, కనకరత్నం తెలిపారు.

అవగాహన సదస్సు

తాళ్లరేవు/యానాం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరైనా అపరచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని కోరంగి ఎస్ఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. తాళ్లరేవు మండలం ఉప్పంగల్‌లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి గ్రామంలోసమస్యలపై చర్చించారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

సామర్లకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో దేవాదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్యనిర్వాహక ఇంజనీరు జె.రామారావు వాణి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవో బళ్ళ నీలకంఠానికి ఆదివారం అందజేశారు. ఈవో ఆధ్వర్యంలో దాత దంపతులకు స్వామి,అమ్మవార్ల దర్శనం చేయించి నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న, అంజిబాబు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న రామారావు దంపతులు

'సామాజిక సేవలు పెద్ద ఎత్తున చేయాలి'

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని ఎన్ఆర్ఐ తల్లిదండ్రుల సంఘాన్ని ఆదర్శంగా తీసుకుని ఇటువంటి సంఘాలు పెద్దఎత్తున ఏర్పడాలని తద్వారా సామాజికసేవలు పెద్దఎత్తున చేయాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని ఇంజనీర్ల సంఘ భవనంలో ఆదివారం ఎన్ఆర్ఐ సంఘ వార్షిక సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు పాలడుగు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. కాకినాడ సంఘంలో ప్రస్తుతం 520 మంది సభ్యులు ఉన్నారని, సంఖ్యను 1000 వరకూ పెంచే ప్రయత్నంలో ఉన్నామన్నారు. సంఘ సభ్యుల సేవలపై కోశాధికారి రామనాథం, వైద్యసేవలపై సహాయకార్యదర్శి వే మూరి నరసింహరావు వివరించారు. రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వైడీరామారావును సత్కరించారు.

'సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి'

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ అంకితభావంతో కృషి చేయాలని ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ వ్యవస్థాపక ప్రముఖ్ పెమ్మసాని రామచంద్రరావు సూచించారు. పిఠాపురంలో ఆదివారం సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశం జరిగింది. ఫౌం డేషన్ జిల్లా కన్వీనర్‌గా నియమితులైన కంబాల నారాయణరావును సత్కరించారు. జిల్లా మహిళా విభాగం ప్రముఖ్ అదట్రా వరహాలు, పిఠాపురం ఖండ ధర్మప్రచారక్ కట్టా బంగార్రాజు, మండల కన్వీనర్ ముమ్మిడి శ్రీనివాసరావు ఉన్నారు.

ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

పాడేరురూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాడేరు ఘాట్‌లో ఆదివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, వ్యాన్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ వ్యక్తి సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని విశాఖ కేజీహెచ్‌కి తరలించినట్టు సీఐ డి.దీనబంధు తెలిపారు. పాడేరులోని చర్చిలో ప్రార్థనల కోసం పాస్టర్ మోసేతో కలిసి మొడివాన మృత్యుంజయకుమార్(32) పరవాడ నుంచి ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. ఉదయం 8.45 గంటలకు పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి పంచాయతీ 12 మైళ్ల గ్రామ సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్తున్న వ్యాన్ ఎదురుగా వస్తోంది. ఈ 2 వాహనాలు ఢీకొనడంతో ఎం.మృత్యుంజయకుమార్ హెల్మెట్ సైతం చితికిపోయి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న పాస్టర్ మోసేకు తీవ్ర గాయాలు కావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. మృతుడి ఆధార్ కార్డు ఆధారంగా కాకినాడ జిల్లా జగన్నాయకపురం పంచాయతీ ముత్తానగర్‌కు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు.

'బాధ్యులను ఏర్పాటు చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య ఐక్యవేదిక భవిష్యత్ కార్యాచరణ కాకినాడ జిల్లాలో ఉన్న అన్ని మండలాలకు బాధ్యులను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షుడు ఒమ్మి రఘురాం అన్నారు. కాకినాడ 36వార్డు సచివాలయం ఎదురుగా ఉన్న రాజేశ్వరి బోటిక్స్ చిమ్నీలో జరిగిన ఆయన మాట్లాడుతూ ఈనెల 22,23 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర మహాసభ, ప్లీనరీకి జన సమీకరణ ఏవిధంగా ఏర్పాటు చేయాలని చర్చించామన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు సుమారు 5మండల బాధ్యుల నుంచి సుమారు 50 మంది కార్య కర్తలకు తగ్గకుండా హాజరై రాష్ట్ర ప్లీనరిని విజయవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆదినారాయణ, సన్యాసిరావు హాజరయ్యారు.



సాయి సందీప్‌కు విశిష్ట సేవారత్న పురస్కారం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్న 'స్పార్క్' చైర్మన్ సాయి సందీప్‌కు విశిష్ట సేవారత్న పురస్కారం లభించింది. ఆదివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో మేడిది సుబ్బయ్య ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావు సందీప్‌కు అవార్డు, జ్ఞాపిక అందజేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

చలిలో చిన్నారులను చంకనెత్తుకుని...



మోతుగూడెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మన్యం జనాన్ని చలి వణికిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. మోతుగూడెంలో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. ఎముకలు కొరికే చలితో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఇంతులూరు వాగు, ఒడియా క్యాంపు, ఎంసీడీ క్యాంపు, ఫోర్ బై క్యాంపు పరిసర ప్రాంతాల్లో గిరిజన మహిళలు చంకలో పిల్లలను పెట్టుకుని చలిలోనే కూరగాయలు విక్రయిస్తున్నారు.

పాపికొండలుకు పర్యాటకుల తాకిడి





పాపికొండలు వెళ్తున్న పర్యాటక బోటు, గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవీపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహార యాత్రకు ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం ఎనిమిది బోట్లలో 507 మంది పర్యాటకులు వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అక్కడున్న బోటు పాయింటు నుంచి గోదావరి ముంపు పరివాహక ప్రాంతాలైన దేవీపట్నం, పూడిపల్లి, మంటూరు, కచ్చులూరు, తాళ్లూరు మీదుగా పేరంటాలపల్లి వెళ్లి జలపాతాల వద్ద సందడి చేశారు. గిరిజనులు తయారు చేసిన వెదురు బొమ్మలను కొనుగోలు చేశారు.

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వేకువజామునే గోదావరిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. టిక్కెట్లు, ఇతరత్రా రూ.24,755 ఆదాయం వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు

టీఎన్టీయూసీ నూతన కార్యవర్గ ఎన్నిక

మోతుగూడెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): టీఎన్టీయూసీ సీలేరు కాంప్లెక్స్ కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. తొలుత టీఎన్టీయూసీ కార్యాలయం నుంచి ప్రాజెక్టు గెస్ట్‌హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెన్‌కో రాష్ట్ర ప్రెసిడెంట్ ఎ.శివనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి టీఎన్టీయూసీ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ ఆర్.సాంబశివరావు, రాష్ట్ర ప్రెసిడెంట్ పి. సాంబశివరావు, రాష్ట్ర అడిషినల్ జనరల్ సెక్రటరీ ఎం.శ్రీరామమూర్తి, రాష్ట్ర కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డొంకరాయి ఎంపీటీసీ కరకా రాములు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్‌కు సంబంధించి కార్మికుల సమస్యలు పరిష్కరించడం, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయడం, కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించి, సమస్యలు తీర్చి వారి కుటుంబాల్లో ఆనందం నింపడం కోసం మేనేజ్‌మెంట్‌తో, ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. మోతుగూడెం జెన్‌కో ప్రాజెక్టికి సంబంధించి సీఐటీయూ నుంచి 20 మంది, 1104 యూనియన్ నుంచి 25 మంది, కాంట్రాక్ట్ కార్మికులు 40 మంది సభ్యత్వం తీసుకున్నారు. సీలేరు కాంప్లెక్స్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా వీడీవీ త్రినాథరావు (అప్పర్ సీలేరు), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా టి.త్రినాథరావు (మోతుగూడెం), కార్యదర్శిగా జె.రత్నాకర్ (మోతుగూడెం), అదనపు కార్యదర్శిగా ఎస్.భాస్కరరావు (అప్పర్ సీలేరు), కోశాధికారిగా ఎం.లక్ష్మణరావు (మోతుగూడెం) ఎన్నికయ్యారు.

కృష్ణా నదిని ఈదిన తండ్రీకూతుళ్లు

కూనవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం ఆక్వా డెవిల్స్ నిర్వహించిన కృష్ణా నది క్రాసింగ్‌లో మండలంలోని పల్లూరు గ్రామానికి చెందిన తండ్రీ కూతుళ్లు ఆవుల సంతోష్‌కుమార్, శాన్వి సత్తాచాటారు. 1.5 కిలోమీటర్ల దూరాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. శాన్వి 31.25 నిమిషాల్లో, సంతోష్ 36.45 నిమిషాల్లో నదిని ఈదారు. సంతోష్‌కుమార్ ఇప్పటికి మూడు సార్లు ఈ పోటీలో పాల్గొనగా, శాన్వికి ఇది మొదటిసారి. గతంలో జరిగిన అనేక ఈత పోటీల్లో శాన్వి పది పతకాలకు పైగా సాధించింది. తండ్రీకూతుళ్లను కూనవరం మండల ప్రజలతో పాటు అధికారులు అభినందించారు.



సంతోష్ కుమార్, శాన్వి

కేంద్ర బడ్జెట్‌తో మధ్య తరగతి ప్రజలకు మేలు

మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్

రంపచోడవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్ అన్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని ఏకంగా 12 లక్షలకు పెంచడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న సుమారు 90శాతం మందికి ఊరటనిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో రాష్ట్రంలోని ఓడరేవులు, విమానాశ్రయాల అభివృద్ధికి రూ.5వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.3.5వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ రద్దు

రంపచోడవరం, ఫిబ్రవరి 2: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రద్దు చేసినట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదివారం ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

ఎటపాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడాన్ని నిరసిస్తూ ఆదివారం గుండాల కాలనీ గ్రామంలో సీపీఎం నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు పులుసు బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయించలేదని, విభజన హామీలను పక్కనపెట్టారని విమర్శించారు. ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా కనిపిస్తోందని ఆరోపించారు. మండల కమిటీ నాయకులు ఐ.పద్మ, జి.హర, తోట శ్రీను, నూతలపాటి సుధాకర్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఆక్రమణల పర్వం

● కాకరాపల్లి ఊర చెరువు నుంచి కోటనందూరు వరకు పంట కాలువను అక్రమించుకున్న వ్యాపారస్తులు

కోటనందూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారిపై కోటనందూరు తలుపులమ్మ తల్లి గుడి నుంచి కాకరాపల్లి ఊర చెరువు వరకు ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు కోటనందూరు మండలం సరిహద్దు. నాతవరం, కోటనందూరు మండలాల్లోని సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాపారాలకు ప్రధాన కూడలి. కాకరాపల్లి నుంచి కోటనందూరు వరకు సుమారు కిలోమీటరు మేర పంట కాలువను అక్రమించుకుని వ్యాపారస్తులు భవనాలు నిర్మించారు. వ్యాపారస్తులు రోడ్డును ఇరువైపులా ఆక్రమించుకోవడంతో ప్రయాణికులు వెళ్లడానికి నానాతంటాలు పడాల్సి వస్తోంది. వాహనాల సంఖ్య అధికం కావడంతో బస్టాండులో నిత్యం ట్రాఫిక్ జామ్ అయి ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. అయిన ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గత టీడీపీ హయాంలో రోడ్ల వెడల్పులో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు.



కోటనందూరు బస్టాండు వద్ద ఇదీ పరిస్థితి

అప్పట్లో రోడ్డుకు ఇరువైపులా సుమారు 125 అడుగులు ఉండేలా కొలతలు తీసి మార్కింగ్ ఇచ్చారు. తర్వాత ఎన్నికలొచ్చి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అస్సలు పట్టించుకోలేదు. ఇరువైపులా 5మీటర్లు వెడల్పు చేస్తామని సుమారు రూ.2 కోట్లతో టెండర్లు పిలిచినా ఉపయోగం లేదు. అధికారుల అలసత్వం కారణంగా రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైందని స్థానికులు చెప్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

'లోవ'లో భక్తుల కోలాహలం

తుని రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా రూ.2.72 లక్షల ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనరు, ఈవో పి.విశ్వనాథరాజు తెలిపారు.



కబడ్డీ సీనియర్స్‌లో విజేతలకు మెమెంటోలు అందిస్తున్న ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్

'భాష్యం' క్రీడా పోటీల్లో విజేతలు వీరే

ఏలేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాష్యం స్కూలులో ఆదివారం బాలికలకు సబ్ జోనల్ క్రీడా పోటీలు నిర్వహించారు. తుని, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేట, ఏలేశ్వరం బ్రాంచిల విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, చదరంగం, క్యారమ్స్, వాలీబాల్ పోటీలు జరిపారు. సీనియర్స్‌లో... ఖోఖోలో పిఠాపురం (విన్నర్), ఏలేశ్వరం (రన్నర్), కబడ్డీ... జగ్గంపేట (విన్నర్), సామర్లకోట (రన్నర్), కార్యమ్స్... జగ్గంపేట (విన్నర్), పిఠాపురం (రన్నర్), చదరంగం... ఏలేశ్వరం (విన్నర్), సామర్లకోట (రన్నర్). జూనియర్స్‌లో... ఖోఖో పిఠాపురం (విన్నర్), ఏలేశ్వరం (రన్నర్), కబడ్డీ... ఏలేశ్వరం (విన్నర్), సామర్లకోట (రన్నర్), కార్యమ్స్... తుని (విన్నర్), జగ్గంపేట (రన్నర్), చదరంగం... తుని (విన్నర్), సామర్లకోట (రన్నర్). విజేతలకు ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్స్ కెసత్యనారాయణ, ఎం.సూర్య, వేణు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మేరీమాత ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ప్రత్తిపాడు గ్రామదేవత సత్తెమ్మతల్లిని ఆదివారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మరేగిరి కొండపై మేరీమాతను దర్శించుకుని జ్యోతిప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, స్థానికులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

'ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయానికి కృషి చేయాలి'

ఏలేశ్వరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పట్టభద్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు ప్రతి ఓటరును స్వయంగా కలిసి కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సూతి బూరయ్య, నాయకుడు జ్యోతుల పెదబాబు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మరేగులలో బంగారం చోరీ

రౌతులపూడి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మరేగులలో ఓ ఇంట్లో దొంగతనం జరిగిన మూడు గంటల్లోనే పోలీసులు దొంగను పట్టుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం... తుమ్మలపల్లి సూరిబాబు ఆదివారం ఉదయం పది గంటలకు చర్చికి వెళ్లి మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చాడు. ఇంటికి వచ్చేచూసేసరికి డోర్ పగిలి పోయి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో రెండు బంగారు చైన్లు, మూడు పెద్ద ఉంగరాలు, రెండు చిన్న బంగారు బిళ్లలు, మూడు చిన్న ఉంగరాలు, జత వెండి పట్టీలు, ఐదు వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన సాంకేతిక ఆధారాలతో గుమ్మరేగుల గ్రామానికి చెందిన బాలుడు చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. అతడిని బీబీ పట్నం గ్రామ శివారులో అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు.



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును చూపిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

వెంకన్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

తొండంగి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏవీ నగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 8వ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ధర్మకర్త యనమల నాగేశ్వరరావు వాటిని భక్తులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షిర్డీ సాయిబాబా, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దంపతులు, ఎమ్మెల్యే యనమల దివ్య దంపతులు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యావ్ దంపతులు హాజరవుతారన్నారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేత



జగ్గంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రావులపల్లికి చెందిన మాదబోయిన తాతారావు అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వృద్ధాప్య పెన్షన్ తీసుకునేందుకు గ్రామంలో అందుబాటులో లేడన్న విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో కాట్రావులపల్లి సచివాలయం-2 ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్-2 ఎస్ఆర్‌కే అన్సారీ స్వయంగా కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి తాతారావుకు పెన్షన్ సొమ్ము అందజేశాడు.

నెల్లిపూడిలో ఉచిత వైద్య శిబిరం

శంఖవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నెల్లిపూడిలో జనసేన మండల శాఖ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ప్రారంభించారు. విశాఖ శంకర ఫౌండేషన్ వైద్యులు సుమారు 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 30 మందికి కళ్లజోళ్లు అందించారు. మరో 25 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని సిఫార్సు చేశారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, జ్యోతుల శ్రీను, కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, నాగేశ్వరరావు, కందా శ్రీను పాల్గొన్నారు.

'ముద్రగడ ఇంటిపై దాడితో జనసేనకు సంబంధం లేదు'

జగ్గంపేట/కిర్లంపూడి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై ఆదివారం జరిగిన దాడితో తమ పార్టీకి ఏ విధమైన సంబంధం లేదని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఈ ఘటన దురదృష్టకరమని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

తుని రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ట్యూషన్‌కి వెళ్లి అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. తుని పట్టణానికి చెందిన యడ్ల హేమంత్‌వర్ధన్, మాచుపల్లి శ్యాంప్రసాదులను పోలీసులు హైదరాబాద్‌లో గుర్తించగా తుని తీసుకొచ్చారు. ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ గీతా రామకృష్ణ చెప్పారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గండేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళూరు గ్రామానికి చెందిన నీలపు రాంబాబు (37) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ఆదివారం మల్లేపల్లి శివారున నీచు గుండాల చెరువు గట్టు వద్ద చనిపోయిన ఉన్నట్టు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గండేపల్లి హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సత్యదేవునికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి వారాంతపు ఆర్జిత సేవ అయిన ప్రాకార సేవ ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను చిన్న రథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ మూడుసార్లు ప్రదక్షిణ గావించారు. ఈవో సుబ్బారావు దంపతులు, పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్లు ఐవీ రామారావు, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాత సత్యనారాయణ

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన వీరవెంకట సత్యానారాయణ-వాణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని పీఆర్వో కృష్ణారావుకు ఆదివారం అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి ప్రసాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఓలేటి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



అరసవిల్లి బయల్దేరిన ప్రచార రథం

అరసవిల్లి శోభాయాత్రకు సత్యదేవుని ప్రచార రథం

అన్నవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి సూర్యనారాయణస్వామి శోభా యాత్రపై అన్నవరం సత్యదేవుని రథం ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్ ఆదేశాలతో ప్రచార రథాన్ని సుగంధభరిత పుష్పాలతో అలంకరించి ఆదివారం అరసవిల్లి పంపించారు. మూడు రోజుల పాటు శోభా యాత్ర జరుగుతుందని అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గండేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి శ్రీను (42) కొన్నాళ్లుగా కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదని మనస్థాపంతో ఈ నెల ఒకటో తేదీన గడ్డి మందు తాగాడు. అతడిని కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.